
# గవర్నమెంటు కథలు.5




రాజవరం స్టేషను జనంతో క్రిక్కిరిసి ఉంది. వెంకటగిరికి పోయే రైలు ప్లాటుఫారమ్ మీదకు వస్తోంది.

ఒక్కసారి అక్కడ అంతా హడావుడి. తేనెపట్టు చెదరగొడితే ఈగలు లేచినట్లు అందరూ ఒక్కసారి లేచారు-అందరూ రైలు ఏదో విధంగా ఎక్కవలసిందేగా!

'స్వాతంత్ర్యం వచ్చి ముప్పై ఏళ్ళు దాటినా రైలు ప్రయాణం కంటే యమలోకమే బాగుంది అనేలా ఉంది' అనుకున్నాడు రమణమూర్తి. రైలు ఎక్కగలనా అన్న బెదురుతో గుండె వేగం హెచ్చింది.

రైలు ప్లాట్ ఫామ్ దగ్గర ఆగింది. రమణమూర్తికి రిజర్వే

# షాక్...షాక్

డి.వి.యస్.ఆర్.మూర్తి



షను లేదు. అతి కష్టంమీద ఒక పెట్టెలోకి దూరేసరికి చావు తప్పి కన్ను లొట్టపోయింది.

అప్పుడు చటుక్కున గుర్తు వచ్చింది. జేబులు తడుముకున్నాడు. అదృష్టవంతుడే. ఏమీ పోగొట్టుకోకుండా రైలు ఎక్కాడు. ఘన విజయం. టెన్సింగ్ ఎవరెస్టు శిఖరం ఎక్కినట్లు ఫీల్ అయ్యాడు.

కొంచంసేపు రమణమూర్తి ఒంటికాలుమీదే నిలబడ్డాడు. చివరకు జాగా చేసుకుని క్రింద చతికిల పడ్డాడు.

అతడు ప్రయాణం చేయవలసింది చాలా ఉంది. రాత్రి అంతా అందులోనే గడపాలి. 'భగవంతుడా! నా బద్ధ శత్రువుకి కూడ ఈ

పాట్లు వద్దు.' అప్రయత్నంగా అను కున్నాడు రమణమూర్తి.

రైలు బెజవాడ చేరే సరికి కూర్చోడానికి అతడికి చోటు దొరి కింది. తెచ్చుకున్న టిఫెను తిని కడుపునిండా నీళ్ళు త్రాగాడు.

రైలు బయలుదేరింది. తెల్లవారే సరికి అతడు వెంకటగిరి చేరుతాడు. ఏదో జోగులా వస్తోంది. ఆ జోగులో అతడి ఆలోచనలు రైలు కంటే వేగంగా పరుగెట్టసాగాయి.

* * *

"మాష్టారూ! అంతా మీ చలవ. మీ ఋణం నేను ఎలా తీర్చుకో గలను?" అంటూ రమణమూర్తి శ్రీరామ్ మాష్టారి పాదాలను కళ్ళకు అద్దుకున్నాడు.

ఆ దృశ్యం అతడు యం. యస్ సి. ప్యాసయి నప్పటిది. అతడు యూనివర్సిటీ ఫస్టు. పైగా నూటికి తొంభై మార్కులు తెచ్చుకుని రికార్డు స్థాపించాడు.

అతడు యం.యస్‌సి. చదవ డానికి కారణం శ్రీరామ్ మేష్టారు. శ్రీరామ్ రాజవరం కాలేజీలో లెక్చరరు.

రమణమూర్తి ప్రతిభ చూసి అతడు రమణకు సహాయం చేసాడు. నిజానికి అతడికి యం. యస్‌సి. చదువుకునే శక్తిలేదు.

శ్రీరామ్ కొంత సహాయం చేసాడు. కొంత సహాయం లోను రూపంలో ఒక బ్యాంకునుండి ఇప్పించాడు. అతడి చదువు పూర్తి చేయించాడు.

"నేను చేసింది ఏముంది రమణా? నీవు తెలివైనవాడవు. నీలాంటివాళ్ళు చదువు మానేస్తే దేశానికి నష్టం. నీవు అదృష్టవంతు డవు" అంటూ శ్రీరామ్ రమణ మూర్తిని దీవిస్తూంటే అతడి కళ్ళ వెంట ఆనంద బాష్పాలు రాలాయి.

ఆ శ్రీరామ్ మేష్టారు అతడి పరిస్థితి చూస్తే తప్పక బాధపడ తారు. ఆయన ఇప్పుడు రాజ వరంనుండి ట్రాన్స్‌ఫరు అయి పోయాడు. అందుకు రమణ సంతో షించాడు. మేష్టారికి అతడి పాట్లు తెలియవు. అదే అతడు కోరు కునేది.

యం. యస్‌సి. ప్యాసయిన వెంటనే అతడి ఆశలు గుర్రాలలా పరుగెత్తాయి. అతడి మార్కులు చూసి ఎవరైనా ఉద్యోగం ఇస్తారు. అతడు హాయిగా జీవించవచ్చు.

అతడిమీదే ఆశలు అన్నీ పెట్టు కుని బ్రతుకుతోన్న అతడి తల్లి, చెల్లెలు ఇక కష్టపడవలసిందిలేదు. చెల్లెలికి మంచి సంబంధం చూసి

చేయవచ్చు. రమణ గాలిమేడలు కట్టుకున్నాడు.

అతడు ఎన్నో ఉద్యోగాలకు అప్లికేషనులు పెట్టాడు. ఎన్నో కాలేజీలకు లెక్చెరరు పోస్టుకు అప్లయి చేసాడు.

ఎక్కడా అతడు అనుకున్నట్లు జరుగలేదు. మెరిట్‌కు ఎక్కడా స్థానం ఉన్నట్లు అతడికి కనిపించ లేదు. అతడికి మెరిట్ తప్ప మరో క్వాలిఫికేషనులేదు.

ఎక్కడ చూసినా లంచం. లేక పోతే రెకమండేషను. ఈ రెంటిలో ఏదో ఒకటి లేకపోతే ఉద్యోగం కష్టం.

'ఈ వ్యవస్థ కుళ్ళిపోయిందా?' అన్న ప్రశ్న రమణమూర్తికి ఎదురైంది. ప్రతిచోట ఓటమి ఎదురయ్యేసరికి అతడిని నిరాశనిస్పృహ వెంటాడాయి.

ఈ వ్యవస్థమీద అతడికి కోపం కూడ వచ్చింది. మెరిట్‌కు స్థానం లేని వ్యవస్థ నాశనం అయిపోతుంది. 'దీన్ని బాగుచేయడం ఎలాగా' అని కూడ అతడు ఆలోచించకపోలేదు. అది అతడి చేతిలో లేనిదని నిర్ణయించుకున్నాడు.

ఎప్పటికైనా మంచి రోజులు రాకపోతాయా అన్న ఆశతో రమణ కాలం గడుపుతున్నాడు. ఇక ఉద్యోగం దొరకకపోతే ఏ కూలిపని అయినా చేసుకోవాలి. లేకపోతే రోజులు వెళ్ళేలా లేవు. అతడి మనస్సు అస్తవ్యస్తంగ ఉంది.

అప్పుడే వెంకటగిరి విశ్వవిద్యాలయం నుంచి అతడికి లెక్చరరు పోస్టుకి ఇంటర్‌వ్యూ వచ్చింది. 'ఈ ఉద్యోగం వస్తే తిరుపతి వచ్చి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుంటాను' అని అతడు మొక్కుకున్నాడు.

దిక్కు తోచనప్పుడు దేవుడు కనిపిస్తాడు!

అలా మొక్కుకున్నాడో లేదో అతడి స్నేహితుడు కాంతారావు దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. కాంతారావు వెంకటగిరి విశ్వవిద్యాలయంలో లెక్చెరరు. పెద్ద రెకమండేషన్‌తో సెకండు క్లాసు క్వాలిఫికేషనుతో అక్కడ ఆ పోస్టు సంపాదించాడు. కాంతారావు ఉత్తరంలో రమణకు ఆశ చూపించాడు.

రమణ ఉద్యోగం వచ్చినట్లే అనుకొని వెంకటగిరికి రైలు ఎక్కాడు.

ఏదో స్టేషనులో రైలు ఆగిన కుదుపుకి అతడికి మెళకువ వచ్చి, గతంలోంచి బయటపడ్డాడు.

* * *

రమణమూర్తి రైలు దిగి నేరుగా యూనివర్సిటీకి వెళ్ళాడు. కాంతారావు క్వార్టర్సు సుళువుగానే పట్టుకున్నాడు.

"వచ్చావా రమణా! రా!" అని కాంతారావు అతడిని ఆప్యాయంగా ఆహ్వానించాడు.

"నీ మీదే ఆశ పెట్టుకువచ్చాను. పాల ముంచినా నీట ముంచినా నీవే!" ఆ మాటలు అన్న తరువాత అతడి మనస్సు కుదుట పడింది.

"ఇంత క్వాలిఫికేషను పెట్టుకుని ఇంత బెంబేలు పడుతున్నా వేమిటీ? ధైర్యంగా ఉండాలోయ్. భయ పడితే ఇంటర్వ్యూ పాడు చేస్తావు."

"నాలో ఆశ పోయింది కాంతం. మెరిట్ ప్లస్ ఏదో ఉండాలి. అప్పుడే ఈ రోజుల్లో ఉద్యోగం. ఆ ప్లస్ ఇక్కడ నాకు నీవే. నన్ను గట్టున పడెయ్యి." ప్రాధేయ పడ్డాడు రమణ.

"నా ప్రయత్నంలో లోటు లేదు. నీకు వస్తుందని నమ్మకం ఉంది."

"నీ నోటి వాక్యాన అలా జరిగితే నా చెల్లెలు శాంతి ఒక ఇంటిది అవుతుంది. మా అమ్మ ముసలితనంలో సుఖంగా కళ్ళు మూస్తుంది. నా జీవితానికి ఒక మార్గం కనిపిస్తుంది."

"చీకటిలో ఉన్నావని వెలుగు కనుపించదనుకోకు. రాత్రి తరువాత పగలు వచ్చి తీరుతుంది. జీవితం లోనూ అంతే."

రమణకు ఏదో ధైర్యం వచ్చింది. ఉద్యోగం దొరుకుతుంది అన్న నమ్మకం కలిగింది.

* * *

సాయంత్రం సరిగా నాలుగు అయింది. రమణ విశ్వవిద్యాలయ ఉపకులపతి గది ముందు హాజ రయ్యాడు.

అప్పటికే అక్కడ ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళు ఎందరో ఉన్నారు. వాళ్ళందరినీ చూచేసరికి అతడికి కళ్ళు చెదరాయి. నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమయింది.

విశ్వవిద్యాలయంలో కాళీలు రెండు మాత్రమే. ఇంటర్వ్యూకి సుమారు అరవై మంది ఉన్నారు. వరండా అంతా అభ్యర్థులతోటి నిండిపోయింది.

అందరిని అప్పుడు ఎలా ఇంటర్వ్యూ చేస్తారో రమణకు తెలియలేదు. సరిగా పరీక్ష చేయా లంటే కనీసం పది నిముషా లయినా పడుతుంది. దానిని పట్టి తేలింది ఒక విషయం- ఇంటర్

వ్యూహ్య ఒక తంతు- ఒక ఫార్సు- ఒక తమాషా.

ఏదైనా పోస్టు ఎడ్వర్టైజు చేసేసరికే దానికి కేండిడేటు సెలక్టు చేయబడి ఉంటాడు. ఈ రోజుల్లో అదే జరుగుతోందని అందరికీ తెలిసిన విషయమే.

"హల్లో రమణా!" ఒకగొంతు వినిపించింది.

"హల్లో సత్యం" అన్నాడు రమణ. సత్యం అతడి క్లాసుమేట్.

"ఏమిటి, నీవూఇంకా వేటలోనే ఉన్నావా? అంతా వేస్ట్. ఏదో ఆశ పెట్టుకుని మనం వస్తాము. ఎవరో మంత్రిగారి కేండిడేటు రెడీగా ఉన్నాడట. 'నాదే ఈ పోస్టు' అని అతడు చెపుతున్నాడట. రెండో దానికి ఎవరున్నారో? మనలనందరినీ చంపడం దేనికో!"

"అందరిలానే నేనూ వచ్చాను. చూద్దాం. మన చేతుల్లో ఏముంది? అంతా దేవుడి దయ" అన్నాడే కాని రమణ పైప్రాణాలు పైనే పోయాయి.

"ఇంకా దేవుడు ఉన్నాడంటావా? ఉంటే డబ్బులో ఉన్నాడు. రెకమండేషన్‌లో ఉన్నాడు."

అంతలోనే అక్కడ అందరూ లేచి నిలబడ్డారు. అప్రయత్నంగా రమణా నిలబడ్డాడు.

ఎవరో ఒక వ్యక్తి సూటులో వస్తున్నాడు- ఏనుగుగున్న నడచి వస్తూన్నట్లుంది.

అతడు ప్రొఫెసరు మూర్తి అని తెలిసింది. విగ్రహం మాత్రం ప్రొఫెసరు విగ్రహమే.

కావి, పట్టి గంగిరెద్దు అని కూడా తేలిపోయింది. ఉపకులపతి మాటకు ఎదురు చెప్పడు. దానికి కారణం ఉంది. ఈ గంగిరెద్దు ఉపకులపతి పోస్టుకు గేలం వేస్తున్నాడు.

మరికొన్ని నిముషాలు గడిచాయి. మళ్ళీ అందరూ లేచి నిలబడ్డారు. కొందరు వంగి వంగి నమస్కారాలు కూడా చేస్తున్నారు. అది చూచి రమణ- ఇతడు ఇంకా గొప్పవాడని నిర్ణయించుకున్నాడు.

ఆ వేషం చూస్తే బికారి వేషం. మనిషిని చూస్తే అసలు మతే పోతుంది. అచ్చు కొండ ముచ్చుని చూసినట్లే.

అతడే ఉపకులపతి అని రమణకు ఎవరో చెప్పారు. 'రూపంలోఏముందిలే'అనుకున్నాడు రమణ.

ఆ ఉపకులపతి రాజకీయ దురంధరుడట. రాజకీయాలలో లేక పోయినా రాజకీయ నాయకులతో

సంబంధం ఉంది అతడికి. బ్రతుక నేర్చినవాడు.

రాజకీయ నాయకులే ఈనాడు చిల్లర దేవుళ్ళు. వాళ్ళని నమ్ముకున్నాడు- ఉపకులపతి అయి కూర్చున్నాడు. ఇంకా ఏదో పై పోస్టుకి కూడా పోతాడట.

ఉపకులపతి గదిలోకి వెళ్ళిన పావుగంటలో ఇంటర్‌వ్యూలు ప్రారంభం అయ్యాయి. కేండిడేట్లు వెళ్తున్నారు- వస్తున్నారు. వెళ్ళడం, రావడం ఒకేసారి జరుగుతున్నట్లుంది.

రమణ కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. అతడి మనస్సు ఇంటర్‌వ్యూమీద లేదు.

'ఇది ఇంటర్‌వ్యూ ఏనా? ఇంత డబ్బు ఖర్చు చేసుకుని వచ్చినందుకు ప్రయోజనం సున్న. ఇక్కడికి రావడానికి చేసిన అప్పు తీర్చడం ఎలాగ?' రమణ ఆలోచించుకుంటున్నాడు.

ఇంతలో రమణ పేరు వినిపించింది. అతడి టరను వచ్చింది. గబగబా లోనికి వెళ్ళాడు.

"నీ పేరేమి"టని ఉపకులపతి అడిగాడు. "నీవు ఎప్పుడు ప్యాసయ్యావు?" అని ప్రొఫెసర్ అడిగాడు. రమణ చెప్పాడు.

"థాంక్యూ!" అన్న ఉపకులపతి మాటతో ఎన్నో రోజుల నుంచి ఎదురు చూచిన ఇంటర్‌వ్యూ కొన్ని క్షణాలలో ముగిసిపోయింది.

వెర్రి ముఖం వేసుకొని గది బయటకు వచ్చాడు రమణ. వంచిన తల పైకిఎత్తకుండా మెట్లు దిగాడు.

కాంతారావు అతడికి ధైర్యం చెప్పాడు. మరునాడు వచ్చి రైలు ఎక్కించాడు.

తిరిగి వస్తున్న రమణకు పిచ్చి ఎక్కినట్లుంది. తిరిగి వెళ్ళి అమ్మకు ముఖం ఎలా చూపించనా అన్నదే అతడి బాధ.

'ఈ రైలు క్రిందపడి చచ్చిపోతే.... నా చావే నా సమస్యకు పరిష్కారం. నేను చచ్చిపోతా' అన్న నిర్ణయం వచ్చింది.

ఆ క్షణంలో రమణకు తల్లీ చెల్లెలూ గుర్తుకు వచ్చారు.

* * *

"ఏమైందిరా రమణా?" గుమ్మంలో అడుగు పెట్టగానే అతడి తల్లి ప్రశ్నించింది.

"మామూలే అమ్మా! ఎవరో మంత్రిగారి కేండిడేటు ఉన్నాడు. నన్ను చూసేది ఎవరు? నేను చదువుకోక పోయినా బాగుండి ఉండును. ఏ కూలో నాలో చేసుకుని హాయిగా బ్రతికేవాడివి."

"బాధపడకురా. అన్నిటికీ ఆ దేవుడే ఉన్నాడు."

రమణ బెంగ పెట్టుకున్నాడు. సరిగా తిండి తినడం లేదు. ఏదో పరధ్యానం. కిలకిలలాడుతూ ఉండే వాడిలో నవ్వే కరువైంది.

శాంతి అతడికి ధైర్యం చెప్పింది. ఎన్ని చెప్పినా, ఎన్ని చేసినా అతడిలో మార్పులేదు. అలా ఒక వారం గడిచింది.

సరిగ్గా పదకొండు గంటలైంది. పోస్టుమేన్ ఒక రిజిస్టర్ కవర్ తెచ్చాడు. సంతకం పెట్టి తీసుకుని రమణ గబగబా చింపి చూశాడు.

ఆ కాగితం అంతా అతుక్కుపోయింది. అక్షరాలు రమణకు కనుపించడంలేదు. అది రిగ్రేట్ కార్డు అని అతడి నమ్మకం.

శాంతి ఆ కాగితం అతడి చేతిలోంచి లాక్కుంది. ఆమెముఖంలో సంతోషం. 'కంగ్రాట్సు' అంది ఆమె.

రమణ ఆమె వైపు వెర్రిగా చూశాడు. 'నిజంగానా శాంతీ' అన్నాడు.

అతడిని ప్రొబేషనరుగా సెలక్టు చేసినట్లు కాగితం యూనివర్శిటీ నుండి వచ్చింది. అది రమణకు కలలాగా ఉంది.

"ఏవేవో చెప్పావు, చూసావా? రికమెండేషన్‌లు అన్నావు, ఇవి అన్నావు, అవి అన్నావు. ఇప్పుడైనా తెలిసిందా-దేవుడి రికమెండేషన్‌ముందు ఏదీ ఆగదని" అంది రమణ తల్లి.

రమణ తల్లి సరాసరి పూజా మందిరం దగ్గరకు వెళ్ళింది. దేవుడి ముందు సాష్టాంగ పడింది.

శాంతి, రమణ కూడ ఆమె వెనకాలే నడిచారు. ఆమె ప్రక్కన వాళ్ళూ మోకరిల్లారు.

అందరి మనస్సులలోనూ ఆనందం వెల్లివిరిసింది.

* * *

ప్రతి రోజూ రమణ పోస్టాఫీసుకు వెళ్ళి తిరిగి వస్తున్నాడు. ఎప్పాయింటుమెంటు ఆర్డరుకోసం ఎదురు చూస్తున్నాడు.

ఏ రోజుకారోజు వస్తుందని అనుకోవడం,రాకపోవడంతో మరునాడు వస్తుందని తృప్తిపడడం. 'రేపు రేపు' అనుకొంటూ ఎన్నో రేపులు గడిపాడు రమణ.

ప్రతి రోజూ యుగంలా గడువ సాగింది రమణకు. వేచి ఉండడం కష్టమయింది.

వెంకటగిరి స్వయంగా వెళ్ళి విషయం తేల్చాలి. కాంతారావు సహాయంతో ఆర్డరు తీసుకోవాలి. ఆ నిర్ణయం తీసుకుని తిరిగి అప్పు

చేసాడు. వెంకటగిరి రైలు ఎక్కాడు.

రైలు దిగి రమణ కాంతారావు ఇంటికి వెళ్ళాడు. అప్పుడు అతడు ఇంటి దగ్గర లేడు. చీకటి పడిన తరువాత అతడు వచ్చాడు.

"ఉత్తరం పత్రంలేకుండా ఇలా ఊడిపడ్డావేం?" అని ప్రశ్నించాడు కాంతారావు.

"ఏం చేయను? నీవా ఉత్తరం వ్రాయలేదు."

"సరే, ముందు స్నానం చెయ్యి. భోజనం అయిన తరువాత ఆ విషయం మాట్లాడుకుందాం. కంగారు పడకు."

* * *

"హల్లో. సత్యమూర్తి ఎట్ దిస్ ఎండ్ ప్లీజ్!"

ఆ ట్రంకాల్ వచ్చి నప్పుడు సత్యమూర్తి మీటింగ్‌లో ఉన్నాడు. అక్కడ ఏనుగుగున్న ప్రొఫెసరూ ఉన్నాడు.

"నమస్కారం సార్" అంటూ సత్యమూర్తి కుర్చీలోంచి లేచి నిల బడి పోయాడు. ఎక్కడి నుండో మాట్లాడుతోన్న వ్యక్తి ఉన్నట్లు, నమస్కారం అంటూ నిజంగానే నమస్కారం చేసినట్లుంది అతడి తీరు.

ఆ మాట్లాడే వ్యక్తి ఎదురుగా ఉంటే అతడు ఏమి చేసేవాడో!

"మీరుచెప్పినట్లేచేసాను సార్. ఆ....అదే...ఆ రమణమూర్తిని సెలక్టు చేసాను. అప్పాయింటు మెంటు ఆర్డరు కూడా రెండు రోజులలో పంపుతానండీ!" ఏదో తప్పు చేసిన వాడిలా కంగారు పడ సాగాడు సత్యమూర్తి.

అవతల నుండి ఫోనులో ఏవో మాటలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఏదో కొంప మునిగినట్లుంది.

"పొరపాటు అయింది సార్! క్షమించండి. నేను ఇ. రమణ మూర్తి అనుకున్నాను సార్. ఇప్పుడే ఆ వి. రమణమూర్తిని సెలక్టు చేసి నట్లు మార్చేస్తాను సార్! ఇ ని వి చేయడమే కదా సార్. తప్పకుండా- యస్ సార్." సత్యమూర్తి ఫోను పెట్టేశాడు.

అప్పుడు సత్యమూర్తి మీటిం గులో ఉన్నట్లు గ్రహించాడు. కొన్ని నిమిషాలలో దానిని ముగిం చేసాడు.

సత్యమూర్తికిఉపకులపతిపదవీ కాలం అయిపోయింది. దానికంటే మంచి పదవి వచ్చేలా ఉంది. ఈ సెలక్షను విషయం వల్ల ఆ పదవి అతడికి పోకూడదు.

అందుకే ముఖ్యమంత్రి చెప్పిన ప్రకారం ఇ. రమణమూర్తి

వి. రమణమూర్తి అయిపోయాడు. అదీ జరిగిన విషయం.

కాంతారావు విషయం అంతా పూస గ్రుచ్చినట్లు చెప్పాడు. రమణ మూర్తికి సినిమా చూపినట్లుంది. ఆ లోకంలో రాబందులూ, గ్రద్దలే అన్నీ.

ప్రపంచం అంతా రమణ చుట్టూ తిరుగుతోంది. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి.

"ఏమిటి అలా అయిపోతు న్నావు రమణా? లక్ష్మీ! మంచినీళ్ళు తొందరగా తీసుకురా" అంటూ కాంతారావు లేచి రమణ దగ్గరకు వెళ్ళాడు.

"షాక్ .... షాక్ తిన్నాడు రమణ" అంటూ కుర్చీలో వాలి పోయిన రమణ ముఖం మీద నీళ్ళు చల్లాడు. డాక్టరుకు కబురు చేసాడు.

## రచయితలకు మనవి

'విజయ' లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు—ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరువారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగు తుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజన ముండదు. 'బాపు అభిమానుల పేజీ' లో పాల్గొనే పాఠ కులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్

'విజయ'

80- ధనలక్ష్మికాలనీ,

మద్రాసు-600 026.